క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశం రేపు

పూతలపట్టు(యాదమరి): వైఎస్సార్‌సీపీ పూతలపట్టు మండలస్థాయి సమావేశం రేపు జరగనుందని పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం పి.కొత్తకోటలోని శ్రీనివాస కల్యాణ మండపంలో పార్టీ నాయకులతో భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందని కేవలం ప్రచార ఆర్భాటాలు తప్పా చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గురువారం జరిగే ఈ సమావేశానికి మండలంలోని పార్టీ సీనియర్ నాయకులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మహిళా నేతలు, అనుభంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

లోవోల్టేజీ సమస్యకు త్వరలోనే పరిష్కారం


స్థల సేకరణపై చర్చిస్తున్న అధికారులు

యాదమరి: యాదమరి మండలంలో నెలకొన్న లోవోల్టేజీ సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపనున్నామని డీఈ మునిచంద్ర అన్నారు. మంగళవారం ఆయన ఆర్డీఓ శ్రీనివాసులుతో కలిసి ఎర్రచేను సమీపంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. అందులో భాగంగానే మండలంలో పలు ప్రభుత్వ భూములను పరిశీలించామన్నారు. అయితే కృష్ణంపల్లి పంచాయతీలోని ఎర్రచేను సమీపంలో 35 సెంట్లు డీకేటీ భూమి అన్నివిధాలుగా అనుకూలంగా ఉందన్నారు. దాదాపు రూ.1.30 కోట్ల అంచనాతో సబ్‌స్టేషన్ నిర్మించనున్నట్లు చెప్పారు. స్థల సేకరణ పూర్తయ్యాక త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే దాసరాపల్లి, కృష్ణంపల్లి, కొటాలం, ఓటేరుపల్లి, వేపనపల్లి పంచాయతీలలో లోవోల్టేజీ సమస్య తీరే అవకాశం ఉంది. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ పార్థసారథి, ట్రాన్స్‌కో ఏఈ గుర్రప్ప, సర్వేయర్ తులసి,వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వస్థ్ నారీ- స్వశక్త్ పరివార్ అభియాన్

ఐరాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెడుతున్న స్వస్థ్ నారీ.. స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డప్ప, కాణిపాకం పీహెచ్‌సీ వైద్యాధికారులు స్వాతిసింధూర, రాజేశ్వరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వస్థ్ నారీ.. స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా మహిళలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేయడానికి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రెండు పీహెచ్‌సీల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు కోరారు.

అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేయడానికి ఐటీఐ వివిధ ట్రేడుల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీపీటీఓ రాము తెలిపారు. డీజిల్ మెకానికల్ 33, మోటార్ మెకానికల్ 2, ఎలక్ట్రీషియన్ 8, వెల్డర్ 1, పెయింటర్ 1, ట్విట్టర్ 3 చొప్పున దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబర్ 4వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

నేలవాలిన స్తంభాలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో నష్టం వాటిల్లిందని ఈఈ మునిచంద్ర తెలిపారు. ఐరాలలో 25 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ 1, 9.1 మీటర్స్ కరెంటు స్తంభాలు 3, పైపల్లెలో 25 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ 1, 16 కేవీ 1, 8 మీటర్ల స్తంభాలు 2, అరగొండలో ఇనుప కరెంటు స్తంభం 1, చిత్తూరులో 9.1 మీటర్ల కరెంటు స్తంభాలు 5 దెబ్బతిన్నాయన్నారు. వీటి ద్వారా విద్యుత్‌శాఖకు దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లిందన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పునరుద్ధరణ పనులు చేపట్టారని వివరించారు.

రైతులకు అవగాహన

గుడిపాల: వేరుశనగ పంటలో మేలైన యాజమాన్య పద్ధతులు గురించి రైతులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని వ్యవసాయాధికారి సంగీత అన్నారు. మంగళవారం గుడిపాల మండలంలోని పాపిశెట్టి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేలైన యాజమాన్య పద్ధతుల గురించి రైతులతో చర్చించారు. ఎర పంటగా ఆముదం వేయడం , కంచె పంటగా ఒత్తుగా జొన్నపంట వేయడం , నీలిరంగు, జిగురు అట్టలు ఉపయోగించడం వల్ల కలిగే లాభాల గురించి తెలియజేశారు.

పాత మిద్దెకు ప్రభుత్వ సొమ్ము

- చిన్నంపల్లిలో పాత భవనంలో అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణ
- వర్షం వస్తే ఉరుస్తున్న భవనం
- ఏళ్ల తరబడి ఇంటి యజమానికి మేలు చేస్తున్నారని అనుమానాలు
- శాశ్వత భవన నిర్మాణానికి చర్యలు తీసుకోని ఐసీడీఎస్ శాఖాధికారులు
- ఇప్పటికైనా సొంత భవనం నిర్మించాలని తల్లిదండ్రుల డిమాండ్



చిన్నంపల్లిలో అద్దె భవనంలో నడుపుతున్న అంగన్‌వాడీ కేంద్రం (ఇన్‌సెట్) పాత భవనం కావడంతో వర్షానికి చెమ్మగిల్లిన మిద్దె పైకప్పు

యాదమరి: క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీలను బలోపేతం చేస్తామన్న కూటమి ప్రభుత్వం మాటలకే పరిమితమవుతోంది. శాశ్వత భవనాల నిర్మాణాలపై దృష్టి సారించడం లేదు. ఇప్పటికీ చాలా గ్రామాల్లో సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో అంగన్‌వాడీ సెంటర్లను నడుపుతున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది. మండల పరిధిలోని చిన్నంపల్లి దళితవాడలో గత కొన్నేళ్లుగా అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేక అద్దె భవనంలో కార్యకలాపాలు నడిపిస్తున్నారు. అయితే ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. అయినా ఆ ఇంటిలోనే సెంటర్ నడుపుతున్నారు. ఇందుకు ప్రతి నెలా అద్దె చెల్లిస్తున్నారు. ఇందులో ఐసీడీఎస్ అధికారుల లోపాయికారితనం స్పష్టంగా కనిపిస్తోంది. పాత భవనం అని తెలిసినా సదరు గృహ యజమానుల జేబు నింపేందుకే ఇక్కడ సెంటర్ నిర్వహిస్తున్నారనే మాటలు స్థానికులు నుంచి వినిపిస్తున్నాయి.

ఆటస్థలం లేదు.. అయినా ఇక్కడే..

పిల్లలు ఆడుకోవడానికి కనీసం ఆడుకోవడానికి అవసరమైన స్థలం కూడా లేదు. వర్షం వస్తే భవనం ఉరుస్తోంది. పైకప్పు నుంచి వర్షపు నీటి చుక్కలు కిందపడుతున్నాయి. దీంతో చిన్నారులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో ఏ సమయానికి ఏమి జరుగుతుందోనని తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇక్కడ కేంద్రంలో దాదాపు 13 మంది చిన్నారులు ఉంటున్నారు. ఇక్కడి పరిస్థితులను పర్యవేక్షించి సమస్య పరిష్కరించాల్సిన అంగన్‌వాడీ ఉన్నతాధికారులు పూర్తిగా అలసత్వం వహిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. చిన్నపిల్లల భద్రతను పూర్తిగా గాలికొదిలేశారని ఆరోపిస్తున్నారు.

సౌకర్యాలు అయినా ఉండాలి కదా..

అద్దె భవనంలో అంగన్‌వాడీ సెంటర్ నిర్వహిస్తున్నా.. కనీస సౌకర్యాలు అయినా ఉండాలి కదా అనేది గ్రామస్తుల వాదన. పిల్లలు ఆడుకోవడానికి స్థలం లేదు. వర్షానికి భవనం కూలితే పరిస్థితి ఏంటని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి సౌకర్యాలు ఉన్న భవనంలోకి అయినా సెంటర్ మార్పు చేయాలని కోరుతున్నారు. అలాగే శాశ్వత భవనానికి చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

పునాదులకే పరిమితమైన భవన నిర్మాణం

గతంలో చిన్నంపల్లి దళితవాడలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో శాశ్వత అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. కొన్ని పనులు కూడా చేపట్టారు. కానీ అనివార్య కారణాల వల్ల పునాదులకే పరిమితమయ్యాయి. ఇకనైనా సంబంధిత అంగన్‌వాడీ ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి చిన్నారుల భవిష్యత్తుకు పునాదులు పడే అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మించాలని కోరుతున్నారు.

అప్పీల్‌కు అవకాశం కల్పించండి సారు


మంచాన పడిన దివ్యాంగురాలు జయలక్ష్మి

ఐరాల: మండలంలోని పాలకల పంచాయతీ రెడ్డివారిపల్లెకి చెందిన దివ్యాంగురాలు జయలక్ష్మికి రీవెరిఫికేషన్‌లో రూ.15 వేల పింఛన్ నుంచి రూ.6 వేల పింఛన్‌కు మార్పు చేస్తూ సచివాలయ సిబ్బంది నోటీసు ఇచ్చారు. తిరిగి అప్పీల్ చేసుకోవాలనే సమాచారం సంబంధిత సిబ్బంది తెలియజేయకపోవడంతో ఆమె సహాయకురాలు ఐరావతి మంగళవారం ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి అప్పీల్‌కు అవకాశం కల్పించాలని ప్రాధేయపడింది. ఎంపీడీఓ స్పందిస్తూ ప్రస్తుతం ఆప్షన్ లేదని చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితిలో రూ.15 వేల పింఛన్ అర్హత ఉన్నా కూడా డాక్టర్ల తప్పిదంతో తమకు అన్యాయం జరిగిందని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కొణతం చంద్రశేఖర్‌ను సంప్రదించారు. ఆయన డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవితో చరవాణిలో సంప్రదించగా ఆమె ఎంపీడీఓను కలవాలని సూచించినట్లు తెలిపారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ నోటీసులు అందుకున్న వారిలో వైకల్యం ఉండి అన్యాయం జరిగిందని భావించిన వారు నోటీసు అందుకున్న నెల రోజుల్లో తిరిగి ఎంపీడీఓ కార్యాలయంలో అప్పీల్ చేసుకునేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఎవరికైనా అప్పీల్ విషయంలో ఏదైనా సమస్య వస్తే అందుకు ఎంపీడీఓలు, జిల్లా కలెక్టర్ బాధ్యత వహించాలని ప్రభుత్వం సూచించిదన్నారు. జిల్లావ్యాప్తంగా ఇలాంటి వారిని సచివాలయ సిబ్బంది గుర్తించి ఇంకా అప్పీల్ చేసుకోని దివ్యాంగులను అప్పీల్ చేయించేలా చర్యలు చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి బుధవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్థానిక గాంధీరోడ్డులోని అర్బన్ డివిజన్ కార్యాలయంలో కార్యక్రమం ఉంటుందన్నారు. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల వినియోగదారులు సమస్యలను రాతపూర్వకంగా తెలపాలన్నారు.

పంచాయతీల అభివృద్ధికి సహకరించండి

యాదమరి: సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి పంచాయతీలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ పెంచల వీరేంద్ర అన్నారు. నూతన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంగళవారం ఆయన పలు గ్రామాల్లో పర్యటించారు. డిప్యూటీ ఎంపీడీఓ రామరాజు రామచంద్రతో కలసి 184 గొల్లపల్లి, మాదిరెడ్డిపల్లి, దళవాయిపల్లి, 12కమ్మపల్లి సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కోసం కార్యాలయాల వద్దకు వస్తుంటారని కాలయాపన చేయక పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. విధిగా సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజారోగ్యం పారిశుద్ధ్యంపై ఆధారపడి ఉందని చెప్పారు. ప్రతి నిత్యం పారిశుద్ధ్య కార్మికులు గడప గడపకు వెళ్లి చెత్తను సేకరించి సంపద సృష్టించాలని చెప్పారు. పలు గ్రామాల్లో మురుగునీరు వీధుల్లో ప్రవహించి ప్రజలకు అసౌకర్యంగా ఉందని తన దృష్టికి వచ్చిందని వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం వారు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఫ్యామిలీ డాక్టర్‌కు అనూహ్య స్పందన


రోగులకు వైద్యం చేస్తున్న డాక్టర్ మోహన్

తవణంపల్లె: మండలంలోని దిగువమత్యంలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి సూచనలు, సలహాలిచ్చారు. గర్భిణులు ఆస్పత్రిలోనే ప్రసవిస్తే తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాలు పాల్గొన్నారు.

స్వస్థ్ నారీ- స్వశక్త్ పరివార్ అభియాన్‌పై సమీక్ష


కార్యక్రమం నిర్వహణపై సమీక్షిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): స్వస్థ – నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వర్తించాలని స్టేట్ నోడల్ అధికారి సునీల్ నాయక్ ఆదేశించారు. చిత్తూరు నగరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య ఆరోగ్య, విధాన పరిషత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం జరిగే స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వర్తించాలన్నారు. ఇందుకు ముందస్తు ప్రణాళికలు అవసరమన్నారు. వైద్యులు, సిబ్బంది, ల్యాబ్ పరికరాలు, మందులు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషశ్రీ, జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, ఆర్‌ఎంఓ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్‌ను విజయవంతం చేయాలని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య తెలిపారు. మంగళవారం పీహెచ్‌సీ పరిధిలో ఎంఎల్‌హెచ్‌ఓ, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. సీహెచ్‌ఓ బాల సూర్యనారాయణ, మలేరియా సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులను మోడల్ స్కూల్లో చేర్పిస్తున్న హెచ్‌ఎం మోహన్‌రెడ్డి

తవణంపల్లె: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని పొన్నేడుపల్లె మోడల్ స్కూల్ హెచ్‌ఎం మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పొన్నేడుపల్లెలో ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు ఇర్ఫాన్ మొదటి తరగతిలో, సుఫియాన్‌ను రెండవ తరగతిలో నమోదు చేయించారు. మోడల్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం చేపట్టిన విద్యావిధానాలకు, విద్యాబోధనకు ఆకర్షితులై విద్యార్థులను బడిలో చేర్పించినట్లు తెలిపారు. తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదుపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న సంగీత

గుడిపాల: ఈ–క్రాప్ నమోదులో చాలా వెనుకబడి ఉన్నామని వ్యవసాయాధికారి సంగీత తెలిపారు. మంగళవారం అగ్రికల్చర్ అసిస్టెంట్లకు ఆమె పేయనపల్లె రైతుసేవా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 52,400 సర్వే నంబర్లు ఉన్నాయని ప్రస్తుతం కేవలం 520 సర్వే నెంబర్లు మాత్రమే ఈ–పంట నమోదు చేయడం జరిగిందని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ మామిడి పంటకు సంబంధించి ఆయా ఫ్యాక్టరీలలో డ్యూటీలు ఉన్నందు వల్ల చేయలేకపోయామని ఈనెలాఖరుకు ఈ పంట నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆమె వారికి సూచించారు. ప్రతి పంటను క్షుణ్ణంగా పరిశీలించి రైతును పంట పొలం వద్దకు రమ్మని వారికి సంబంధించిన రికార్డులన్నింటినీ పరిశీలించి ఈపంట నమోదు చేయాలని వారికి ఆమె సూచించారు.

నేడు జెడ్పీలో విశ్వకర్మ జయంతి

చిత్తూరు కలెక్టరేట్ : విశ్వకర్మ జయంతి వేడుకలు ఈ నెల 17వ తేదీన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానిబాషా తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశ్వకర్మ జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న ఈ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. జెడ్పీలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ ప్రజాప్రతినిధులు, అధికారులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు.

ఓట్ చోరీపై సంతకాల సేకరణ

చిత్తూరు కలెక్టరేట్ : ఓట్ చోరీపై సంతకాల సేకరణ ఉద్యమం చేపడుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ తెలిపారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 15వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా సంతకాల సేకరణ చేపడతామని వెల్లడించారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు


రైతులతో ఏఓ దీప

యాదమరి: పాడిరైతులు తెలియక పశుగ్రాసం పంటలకు అధిక మొత్తంలో యూరియా వాడుతున్నారని అది పశువుల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపిస్తుందని ఏఓ దీప అన్నారు. మంగళవారం ఆమె వరదరాజులపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలరెడ్డి, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: రైతులు పంటల సాగులో మోతాదుకు మించి ఎరువులు వాడితే అనర్థాలు జరుగుతాయని ఏఓ వరలక్ష్మి తెలిపారు. మంగళవారం మండలంలోని వైఎస్ గేటులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నానో యూరి యాపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో మేలైన దిగుబడులు సాధించవచ్చన్నారు. వీఏఏలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలను పరిష్కరించండి

- నేడు, రేపు మహిళా కాంట్రాక్ట్ లెక్చరర్ల ఆక్రందన దీక్ష
- ఏపీ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లత


మాట్లాడుతున్న రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లత

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లత డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గత సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా చివరి దశకు వచ్చి నిలిచిపోయిన కాంట్రాక్ట్ లెక్చరర్స్ సర్వీస్ రెగ్యులరైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. పలుమార్లు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా తమకు న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. గత నెల 11వ తేదీన ఇంటర్మీడియట్ రాష్ట్ర కార్యాలయం వద్ద ధర్నా, పలు ఆందోళనలు చేపట్టినా ఫలితం లేదన్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్ల పట్ల చిన్నచూపు చూడడం అన్యాయమన్నారు. తమకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 17, 18 తేదీల్లో మహిళా కాంట్రాక్ట్ లెక్చరర్ల ఆక్రందన దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అప్పటికీ న్యాయం చేయకపోతే చలో విజయవాడ నిర్వహించి ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు.

సమ్మోహనం


నృత్యం చేస్తున్న కళాకారులు

కాణిపాకం: వార్షిక ప్రత్యేక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో మంగళవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భళా అనిపించాయి. ఉదయం నుంచి రాత్రి వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో వేదిక సందడిగా కనిపించింది. కళాకారులు తమ ప్రదర్శనలతో ఆహుతులను భక్తిపారవశ్యంలో నింపారు. ప్రధానంగా కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు అదుర్స్ అనిపించాయి. గీతాలాపనలు, పౌరాణిక నాటిక ప్రదర్శనలు, గీతాలాపనలు అలరించాయి.

గణేష దీక్ష ఇరుముళ్ల సమర్పణ


ఇరుముళ్లతో భక్తులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక దేవస్థానంలో మంగళవారం భక్తులు గణేష ఇరుముళ్లు సమర్పించుకున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 60 మంది భక్తులు మండల, అర్ధ మండల దీక్షలు చేపట్టారు. ఈ దీక్ష సమయం తీరడంతో వారు ఇరుముళ్లతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఉభయదారులచే ఉచిత ప్రసాద పంపిణీ జరిగింది. కార్యక్రమంలో ఈవో పెంచలకిషోర్ పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి


సభ్యత్వ నమోదు చేస్తున్న ఎస్టీయూ నాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఉపాధ్యాయులకు కరువు భత్యంతో పాటు మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు మదన్‌మోహన్‌నాయుడు డిమాండ్ చేశారు. చిత్తూరు మండలంలోని పలు పాఠశాలలో మంగళవారం ఆ సంఘ నేతలు ఉపాధ్యాయుల సమస్యలను సేకరిస్తూ.. సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు.

ప్రతి ఉద్యోగికి బకాయిల వివరాలు తెలపాలి

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ బకాయిల వివరాలను వెల్లడించాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డి శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఉద్యోగి ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిల వివరాలను కార్డు రూపంలో తెలపాలని కోరారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

తవణంపల్లె: పశువులకు సోకే ప్రమాదకరమైన గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ తెలిపారు. మండలంలోని 32 పంచాయతీల్లో 15 వేలకు పైగా పశువులు ఉన్నట్లు వివరించారు. ఈ నెల 15వ తేదీ నుంచి అక్టోబర్ నెల 15 వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి పశువైద్య సిబ్బంది వెళ్లి పశువులకు టీకాలు వేస్తారన్నారు. రైతులు ముందు జాగ్రత్తగా ఈ వ్యాధి సోకకముందే నివారణ కోసం టీకాలు వేయించుకోవాలని సూచించారు.

పాలేటమ్మకు ప్రత్యేక పూజలు



ఐరాల: మండల కేంద్రంలో వెలసి ఉన్న గ్రామదేవత పాలేటమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ నిర్వాహకులు అభిషేకం అనంతరం పాలేటమ్మ మూల విగ్రహమూర్తిని వివిధ పుష్పమాలలు, నిమ్మకాయ దండలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ నిర్వహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరచాలి


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు

తవణంపల్లె: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యం మెరుగు పరచాలని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు తెలిపారు. మంగళవారం తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో స్వామిత్వ, శానిటేషన్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ గ్రామాల్లో శానిటేషన్‌కు ప్రాధాన్యత కల్పించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈపీఓ సుధాకర్‌రావు మాట్లాడుతూ స్వామిత్వ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఈ నెలాఖరులోగా ఇంటి పన్నుల బకాయిలు చెల్లించాలన్నారు. డీఎల్‌డీఓ రవికుమార్ మాట్లాడుతూ పంచాయతీల్లో అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని వివరించారు. శానిటేషన్‌కు 15వ ఫైనాన్స్ నిధులను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రెడ్డిబాబు, డిప్యూటీ ఎంపీడీఓ మురుగేశన్, పీఆర్ ఏఈ జయచంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఓ వినత్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎన్‌సీడీపై శిక్షణ


మాట్లాడుతున్న వైద్యాధికారి రెడ్డెప్ప

ఐరాల: స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్యాధికారి రెడ్డెప్ప ఆధ్వర్యంలో ఐసీఎంఆర్ టీం వేలూరు సీఎంసీకి చెందిన డాక్టర్లు నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్(ఎన్ఎస్‌డీ) కార్యక్రమంపై రక్తపోటు, మధుమేహం, సీఓపీడీ, ఆస్తమా వ్యాధిగ్రస్తులను కమ్యూనిటీ పరిధిలో ఎలా గుర్తించాలి ? ఎలా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలి, డైటరీ నోటిఫికేషన్, రెఫరల్ వ్యవస్థను ఎలా నిర్వహించాలో ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రెడ్డెప్ప మాట్లాడుతూ దేశ జనాభాపై నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ ప్రభావం ఎక్కువగా ఉందని, వాటిని కమ్యూనిటీ పరిధిలో గుర్తించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సీఎంసీ డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ రక్తపోటు, మధుమేహం, సీఓపీడీ వ్యాధులకు గల కారణాలు, లక్షణాలు, సమస్యల నిర్వహణ నియంత్రించడానికి తీసుకోవాల్సిన అంశాలను క్షుణ్ణంగా వివరించారు. ముఖ్యంగా ఎన్‌సీడీపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలియజేశారు. సీఎంసీ డాక్టర్లు, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.